

# సరిహద్దులు

రచన: "తిరునగర్"

వయస్సు జీవితానికి విశాలదృక్పథాన్ని స్తుంది. అనుభవాలు జీవితానికి గుణపాఠం నేర్పుతాయి. వయసుతోపాటు అనుభవాలదండ పెరుగుతుంది. దాంట్లోంచి మానవుడు తన విలువల పథకాన్ని ఎన్నుకోవాలి.

ఆవేశమనేది, ఒక వస్తువుని చూస్తూ, దాంట్లో తనూ తాదాత్మ్యంపొంది లీనమైపోయినప్పుడు, ఆ వస్తువులో గొప్పదనాన్ని ఆస్వాదిస్తున్నప్పుడూ కలుగుతుంది. కవులు, గాయకులు, చిత్రకారులు, శిల్పులు-ప్రకృతిసౌందర్యంలో లీనమైపోతారు. అప్రయత్నంగా వాళ్లల్లోంచి ఉన్నతభావాలు హిమాలయాల్లోంచి, గంగానదిలా పారాయన్నమాట.

నా జీవితం ఓ అనుభవాలపుట్ట. అన్నిటినీ స్మరించుకుంటూ రాయకుండా వుండటం నాకసాధ్యమైపోయింది. మనుషులు తమకు తాము అర్థంకాకుండానే మిగిలిపోతారనేందుకు ఇదొక నిదర్శనం. మస్తిష్కం ఒక కోణంలోంచి హృదయం ఇంకో కోణంలోంచి, తార్కికం, మరో కోణంలోంచి, భిన్నమైన దారుల్లో పోతూవుంటాయి. వేటిమీద మనకధికారముంది?

ప్రపంచంలో పుట్టటమంటే - కొన్ని కోర్కెలు ఆ ప్రాణికున్నాయని అర్థం. కోర్కెలులేకపోతే మానవజాతి నశించిపోతుంది. సృష్టికిచరిత్రవుండదు; ప్రపంచం ప్రయాణం చెయ్యటం మానుకుంటుంది; ఈ విజ్ఞానం. ఆర్థికశాస్త్రం, నాగరికత, ఇటువంటివేవీ కోర్కెలులేకపోతే అసలు రూపొంది వుండేవికావు. ఈ విషయాలు నావల్లనే మీరు తెలుసుకోవలసిన అవసరం లేదు. పుట్టి భూమ్మీద పడ్డాక ఒక్కొక్కటే దానంతటది ముసుగు తీసుకుని బయటపడి కళ్లువిప్పుతుంది. కాని ఒక్కటి మాత్రం నిజం! కోరికలున్న ప్రతివారూ వాట్ని గురించి కలలు కంటుంటారు కోర్కెలు నెరవేరితే ఆనందం, సుఖం వుందనుకుంటారు. లేనివస్తువు కోసం, అందని అందంకోసం, దూరాన వున్న సుఖం కోసం ఆశించడం మానవధర్మం. వాటిని గురించి తియ్యటి కలలు కనడమూ అంతా సహజమే! ఆ పండని పచ్చికలలోనే నిజమయిన ఆనందం వుందంటే మన తార్కికజ్ఞానం తిరగబడవచ్చు. ఒక్కొసారి తర్కం ఓడిపోయి జీవితానికి సాగిలపడవచ్చు! అదే జీవితంలో అర్థంకాని అవ్యక్తశక్తి. కొన్ని సత్యాలుమనకు అబద్ధంగానూ, కొన్ని అబద్ధాలు మనకి నిజంగానూ కన్పిస్తాయి.

ఇది మాత్రం నిజం! కోర్కెలు తీరకుండా, దాచుకోవడంలో వున్న గొప్పతనం, ఆనందం, అవి నేరవేరటంతో-గుట్టు బయటపడుతుంది. అనుకున్న ప్రతి కోరికానెరవేరితే ఈసుదీర్ఘ జీవితం విసుగేస్తుంది. ప్రపంచంలో తనింకా ఎందుకు బ్రతకాలో అర్థంకాదు. ఉండ బుద్ధి వెయ్యదు; ప్రయోజనమూలేదు.

జీవితం ఏమిటి? దీని ఆద్యంతాల గుట్టు ఎక్కడుంది. ప్రపంచంలో ఇంత విషాదం వుందా? మనిషి తనకుతాను కల్పించుకుంటున్నాడా? సృష్టిలో జన్మించడమే విషాదమనే సిద్ధాంతాన్ని నేనొప్పుకోను. అసలు విషాదం మనిషి తనుతానుగా జీవించకుండా ఇంకోడుగా జీవించాలనుకోవటంలో వుంది. అనుభవాలు జీవితానికి పాఠం నేర్పుతాయి. కాని ఈ అనుభవాల దండు తయారయి మనిషి తానోక నిర్దిష్ట పథకాన్నీ, తన జీవితంలో సాధించిన సత్యాన్ని ప్రయోగించ దలుచుకున్నప్పటికే వయసు సంపోతుంది. తనవతలి ఒడ్డున వుంటాడు. మృత్యువు తలుపు కొడుతుంది. తను శోధించిన సత్యం నిరుపయోగంకాకూడదు. అప్పుడు జీవితం విషాదాన్నించి తప్పించుకొంటుంది.

నేనొక పల్లెటూరివాణ్ణి. అందకూ, అలా చెప్పుకోడానికీ నేను చాలా గర్విస్తున్నాను. అసలు నేను పుట్టడమే అదృష్ట జాతకుడిగా వుంటానట. నేను పుట్టకమునుపు మానాన్నకు రెండెకరాల పొలమే వుండేవట. ఆయన ముండలు, మురాకోర్లకు అలవాటుపడి ఓ ఎకరం భూమిఅమ్మేశాడు; మాఅమ్మని ఎప్పుడూ కొడుతూ, తిడుతూవుండేవాడట. ఆమె ఆ బాధలు భరించలేక "నే బ్రతకడం ఎందుకు? నాకుపిల్లా, పాపా? ఎవరున్నారని? నేనెవరి కోసం జీవించను?" అనుకునేదిట. అంతలోనే కడుపున పడ్డానట. "పుట్టిన తరువాత వాడు మాత్రం ఏంసుఖపడతాడు?" అని ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకోబోయిందట,

కాని అలా జరగలేదు. మాతృ హృదయం విచిత్రమైంది. నేనెవర్నో ఎలా వుంటానో ఆమెకు తెలీదు. కానీ ఆమె మాతృహృదయం ఈ అస్పష్టజీవియెడల అనురాగపూరితమైంది. శిశువుఅందులో తనబిడ్డ అమ్మకు మనస్కొప్పలేదు. ఆ ప్రయత్నం విరమించుకొని ఆశాకిరణంతో క్రొత్తజీవితాన్ని ప్రారంభించింది. ఆమె ఆశలు అడియాశలు కాలేదు. నేను భూమ్మీదపడిన క్షణమహత్యం ఏమిటోగాని మా నాన్న పూర్తిగా మారిపోయాడట. ఇదివరకుమల్లే దూబరాగా ఖర్చుచెయ్యడం మానేశాడట. ముండల దగ్గరికి వెళ్ళటంగాని, త్రాగటంగాని ఇవేమీ లేవిప్పుడు అమ్మని ఆనాడు మొదలు కొట్టనేలేదట. అందుచేతనే నేనంటే ఆమెకు అమితమైనప్రేమ! "నా బంగారుతండ్రి అదృష్టజాతకుడు" అని అందరితో చెప్పకొని మురిసిపోయేదని యిప్పటికీ చెపుతూవుంటారు. ఆమె ఏ మాతృ హృదయపు నిండుతో నన్ను "అదృష్టజాతకుడు మా చిట్టిబాబ"ని హృదయానికి హత్తుకుందో ఆనిండుదనం అలాగే నిలిచిపోయింది. మా నాన్న ఆ సంవత్సరమే ఆ రెకరాలు కట్టుబడికి తీసుకొని సాగుచేశాడట. పంట బ్రహ్మాండంగా పండింది. "ఇదంతా నాబంగారుకొండడే..." అంటూ అమ్మ నన్నింకోసారి హృదయానికి హత్తుకుందిట. నాన్నలో అప్పటివరకూ మరుగుపడిన వాత్సల్యం, బాధ్యత ఒక్కసారి ఉప్పొంగాయి గాబోలు "మానాన్న! చిట్టినాన్న" అంటూ అమ్మచేతిలోనించి నన్ను తీసుకొని ముద్దుపెట్టుకొని బుగ్గ గట్టిగా కొరిగాడట! నేను నవ్వానట!

నాకు అయిదు సంవత్సరాలొచ్చాయి. మహావైభవంగా అక్షరాభ్యాసంచేసి మా ఊళ్ళో అప్పుడే క్రొత్తగా పెట్టిన వీధి బళ్ళో వేయించారు. అదృష్టం రకరకాలుగా వుంటుంది. నా అదృష్టరేఖతో పాటు విద్యారేఖ పెరగలేదు. అందుకే ఆ వీధిబడి చదువుతోనే నాకు చదువు మీద విసుగేసి పోయింది. నాకు పది సంవత్సరాలొచ్చేసరికి నాన్న పది ఎకరాల ఆసామయ్యాడు. ఊళ్లో తగినంత గౌరవం సంపాదించుకున్నాడు. ఆయనంటే ఇదివరకు మల్లే ఘృణితదృష్టితో చూచే వాళ్లిప్పుడువేరు. ఊళ్లో వున్న మోతుబరి రైతులలో ఆయనా ఒకడయ్యాడు.

తమ్ముడు పచ్చబడి క్రాస్త కలిగినవాడయాడని తెలిసేసరికి అక్కయ్యకూ ఆశగానే కన్పించింది. త్రాగి తందనాలాడి, ముండల మురా కొరయిపప్పుడు లేని చుట్టరికం, ఆత్మీయత క్రాస్త అర్జించి అయిదు వేళ్లూ నోట్లోకి పోతూ వున్నాయని తెలియగానే అప్రయత్నంగా ఎక్కణ్ణించో పుట్టుకొచ్చింది. మామేనత్త ఓ రోజు తెల్లవారేసరికి మా యింటి ముందు దిగింది. ఆవిడ విధవరాలు. ఒక కూతురుంది. భర్తచనిపోగా అత్తవారిచ్చిన రెండెకరాల మాగాణి వుంది తనూ, తన కూతురూ తినడానికి. దాంట్లో వచ్చేఆదాయంతక్కువ. ఆపోలమయినా అమ్ముకోడానికి హక్కులేదు. నాన్న వాళ్లక్కయ్య తనింటికి వచ్చినప్పుడు అభ్యంతరమేమీ పెట్టలేదు. స్వంత ఇల్లులా తనూవచ్చి మాయింట్లో భాగం పంచుకుంది. అమ్మగూడా పెద్ద కుటుంబంలోంచే వచ్చింది. ఆమెకూ రక్త స్పర్శలు బాగా తెలుసు. అక్క మీదఏతమ్ముడికి, తమ్ముడి మీద ఏ అక్కయ్యకు ప్రేమవుండదు?" అని మెదలకుండా వూరుకుంది.

మామేనత్త కూతురుపేరు సరస్వతి, ఎఱ్ఱగానూ, బొద్దుగాను వుంటుంది. వాళ్లమ్మ మొదటగా మాయింటిముందు బండిదిగిన రోజుననే వాకిట్లోకి వెళ్లాను. అడుగోనే బావయ్య అంది ఆవిడ కూతురికినావంక చూపి. అంతే! చేతులు రెండూ నాకందించింది బండిలోంచి దింపమని. దానికళ్లు నామీద పడ్డ క్షణ ప్రభావం ఎలాటిదోగాని ఆ క్షణంనుంచీ దానికీ నాకూ ఒక త్రెంచరాని లంకె ఏర్పడిపోయింది. అప్రయత్నంగా దాన్ని ఎత్తుకొని క్రిందికి దింపాను.

సరస్వతికీ నాకూ ఆత్మ-శరీరసంబంధంలాటి సంబంధం ఏర్పడింది. నే బడికివెళ్ళితే నా వెంట తనూ రావాలి. పోనీ బడివదిలాక ఇంటిదగ్గర వదిలితే వుంటుందే అంటే అదీలేదు. ప్రొద్దుటి పూట బడివదిలా. రామక్రిష్ణయ్యగారి మామిడితోటలోకి వెళ్లికాయలు దొంగతనం చెయ్యాలన్నా అదిలేందే వెళ్లడానికి వీల్లేదు. నే కాలుతీసి అవతల పెడితేచాలు.

"బావయ్యా! నేనూవస్తా" అంటుంది

"ఎక్కడకి" అనేవాణ్ణి ముఖం చిట్లించుకొంటూ. సరస్వతి అంత మాత్రంతో బెదిరిపోయేదిగాదు. నాకళ్లలోకి సూటిగాచూస్తూ "నువెక్కడికి?" అంటుంది.

"నాఇష్టం... నేవెళతా ఎక్కడికో?" అనేవాణ్ణి నేను.

ఇకసరస్వతి ఏడుపులంకించుకొనేది. సరస్వతి కప్పుడు కళ్లనీళ్లతో అవసరం లేకుండానే ఎదుటివాళ్లని నమ్మించగలిగిన ఏడుపు తెలుసు "ఊఁ! ఊఁ నేనూవస్తా అంటుంది.

నాకు మహాచిరాకు వేస్తుంది. పెళ్లికి వెళుతూ పిల్లిని చంకన వేసికెళ్లినట్లు ఇదెందుకు నావెంట! రామక్రిష్ణయ్యగారి పాలేరుగాడు చూచాడంటే కాళ్లకు బుద్ధిచెప్పాలి! తనుదూరడానికి కంత లేదుట మెడకోడోలు. ఎంత విదిల్చినా వదిలితేనా? దాని మొండిపట్టు అది విడవదు. అమ్మకేంతెలుసు మా ఎత్తు "పోనీ తీసికెళ్లకూడదటరా!" అనేది. దాంతో మనపని దొంగకు తేలుకుట్టినట్లయేది. ఎక్కడికి వెళుతున్నా సరే ఎంతపోరు పెట్టయినా తనని తీసికెళ్లందే వెళ్లనిచ్చేదిగాదు. ఓసారి ఆ రామక్రిష్ణయ్యగారి పాలేరుగాడు చూచాడు. ఇక చూడండి నా తిప్పలు. బ్రహ్మదేవుడు గూడా ప్రపంచ సృష్టికి పడివుండడు. దాన్నిమోయలేక నడుములు విరిగిపోయాయి. ఇదెక్కడి శిక్షరా భగవంతుడా అని మనసులో అనుకున్నా ప్రయోజనం శూన్యం! ఏ భగవంతుడూ ఆ శిక్ష తప్పించలేకపోయాడు. సరస్వతి కంతాకలిపితే అయిదు సంవత్సరాలు వెళ్లలేదు. ప్రతిదానికీ ఆరాలుతీస్తుంది. ప్లీడరులా "లా" ప్రశ్నవేస్తుంది. దాని ప్రశ్నలకు సమాధానం చెప్పేసరికి తలప్రాణం తోకకొస్తుంది. ఏమిటి చెయ్యడం? తప్పనిసరి!!

ఇంకా వుంది)